
# సింగిల్‌పేజి కథలు




సుబ్బారావు ముప్ఫయి ఏడు సంవత్సరాలు ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాడు. కష్టపడి పనిచేసి ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు సంపాదించాడు. పిల్లలు సైటిల్లైపోయారు కనుక ఇంట్లో తను, అమ్మాయమ్మా, కృష్ణారామా అనుకుంటూ టీవీ సీరియల్స్ చూస్తూ, పుస్తకాలు చదువుకుంటూ విశ్రాంతిగా జీవితం గడపవచ్చనుకున్నాడు.

అలాగే రోజులు గడుస్తూ వుంటే సుబ్బారావుకి మధ్యాహ్నం నిద్ర అలవాటయింది. మధ్యాహ్నం పన్నెండున్నరకి భోజనం చేసి ఒంటిగంటన్నరకి పక్కమీద వాలిపోయేవాడు. సాయంత్రం నాలుగున్నరకి లేచేవాడు. ఈ అలవాటు వలన అర్ధరాత్రి ఒంటిగంటన్నరకి మెలకువ వచ్చి తెల్లవారేవరకూ నిద్రపట్టేది కాదు. మధ్యాహ్నం నిద్ర ఎంత సుఖంగా వున్నా రాత్రి నిద్రపట్టకపోవడం అంతకన్నా నరకంగా వుండేది.

ఏం చెయ్యాలి, ఏ డాక్టర్‌ని సంప్రదించాలి అని సుబ్బారావు ఆలోచిస్తూ వుంటే తెలుగు పేపర్ స్థానిక ఎడిషన్‌లో 'నిద్రలేమి-నిశ్చింతకు హోమీ' క్లినిక్‌లో డా.సుషుప్తిరావుగారిని నిద్రా సంబంధమైన సమస్యలకు సంప్రదించవచ్చనే ప్రకటన కళ్ళబడింది. ఫోన్ నంబర్ నోట్ చేసుకుని సుబ్బారావు ఆ క్లినిక్‌కి ఫోన్ చేశాడు.

ఒక చిలక గొంతు అమ్మాయి ఫోన్ కాల్ ఎటండయి "నమస్తే, నిద్రలేమి నిశ్చింతకు హోమీ క్లినిక్" అంది.

"నమస్తే, డాక్టర్ సుషుప్తిరావుగారి అపాయింట్‌మెంట్ కావాలి" అన్నాడు సుబ్బారావు.

"రేపు ఉదయం పదిగంటలకి ఖాళీ వుంది. రాగలరా" అంది చిలక గొంతు.

"సరే" అని తన వివరాలు సుబ్బారావు చెప్పాడు.

మర్నాడు అమ్మాయమ్మని తీసుకుని క్లినిక్‌కి వెళ్ళాడు సుబ్బారావు. చిలక గొంతు అమ్మాయికి తను వచ్చినట్లు రిపోర్ట్ చేసి భార్యాసమేతంగా జంట కుర్చీలో కూర్చున్నాడు సుబ్బారావు.

అరగంట తర్వాత చిలక గొంతు "మీరు లోపలికి వెళ్ళవచ్చు. డాక్టరుగారు పేషెంట్‌ని పరీక్షించేటప్పుడు, ప్రశ్నలు అడిగేటప్పుడు మరొకరు వుండకూడదు" అంది.

డాక్టర్ గదిలోకి అడుగుపెట్టి "నమస్తే" అన్నాడు సుబ్బారావు.

"రండి. కూర్చోండి. ముందు ఈ టెస్ట్‌లన్నీ చేయించుకుని రండి. ఫీజ్ రిసెప్షన్‌లో కట్టండి" అని డా.సుషుప్తిరావు తను వ్రాసిన టెస్ట్‌ల కాగితం సుబ్బారావుకి ఇచ్చాడు.

టెంపరేచర్, బి.పి, బ్లడ్‌టెస్ట్, యూరిన్ టెస్ట్, ఇ.సి.జి, అలా డాక్టర్ వ్రాసిన ఇచ్చిన తొమ్మిది టెస్ట్‌లు సుబ్బారావు చేయించుకున్నాడు. రిపోర్ట్‌కి మర్నాడు రమ్మన్నారు. సుబ్బారావు మర్నాడు వచ్చి ల్యాబ్ ఫీజ్ వెయ్యి రూపాయిలు చెల్లించి, రిపోర్ట్‌తో డాక్టర్‌ని కలుసుకున్నాడు. రిపోర్టులు చూసి "యూ ఆర్ ఫెర్‌ఫెక్ట్లీ ఆల్ రైట్.." అన్నాడు డాక్టర్ సుషుప్తిరావు.

ఆ సంగతి నువ్వు చెప్పి ఏడవాలా అని మనసులో అనుకున్నాడు సుబ్బారావు.

"మీకు రాత్రి నిద్రపట్టడం లేదన్నారుగా. ఒకవేళ మధ్యాహ్నం కాని నిద్రపోతున్నారా" అడిగాడు డాక్టర్.

"ఔను" అన్నాడు సుబ్బారావు.

"ఎన్ని గంటలసేపు మధ్యాహ్నం నిద్రపోతున్నారు" అడిగాడు డాక్టర్.

"సుమారు మూడు గంటలు" చెప్పాడు సుబ్బారావు.

"మీకు రాత్రి ఎంతసేపు నిద్రపట్టడం లేదు" అడిగాడు డాక్టర్.

"సుమారు మూడు గంటలు" చెప్పాడు సుబ్బారావు.

"దిసీజ్ ది పాయింట్. పగలు ఎంతసేపు నిద్రపోతున్నారో రాత్రి అంతసేపు నిద్రపట్టడం లేదు. యామై కరెక్ట్" అని తన పరిశీలనా ఫలితాన్ని వెల్లడించాడు డాక్టర్. "దీనికి ఒకటే పరిష్కారం వుంది. మీరు మధ్యాహ్నం ఏ పరిస్థితులలోనూ నిద్రపోకూడదు. లెండింగ్ లైబ్రెరీ నుంచి 'హారీ పోటర్' నవల తెచ్చుకుని చదవండి. టి.వి.లో డబ్బింగ్ సీరియల్స్ చూస్తూ వుండండి. లేకపోతే రామకోటి వ్రాసుకంటూ వుండండి. రాత్రి ఎందుకు నిద్రపట్టదో చూద్దాం" అన్నాడు డాక్టర్.

'కొండని తవ్వి ఎలకని పట్టడం అంటే ఇదే రా' అనుకున్నాడు సుబ్బారావు. రిటైర్ అయినవారికి డాక్టర్ సుషుప్తిరావు ఇస్తున్న పదిశాతం ప్రత్యేక కన్సెషన్ ప్రయోజనం పొందిన సుబ్బారావు, డాక్టర్‌కి నాలుగు వందల యాభై రూపాయిల కన్సల్టింగ్ ఫీజ్ చెల్లించాడు.

ఆ మర్నాడు నుంచి సుబ్బారావు మధ్యాహ్నం నిద్రపోవడం మానేశాడు. నిద్ర రాకుండా డాక్టర్ చెప్పిన సూచనలు పాటించడమూ మొదలుపెట్టాడు. అయినా సుబ్బారావుకి యథాప్రకారం నిద్ర కరువయింది. మూడు గంటలసేపు రాత్రి మెలకువగానే వుంటున్నాడు. మధ్యాహ్నం మెలకువగా వున్నా రాత్రి ఫలితం కనిపించలేదు.

"అమ్మాయమ్మా, మధ్యాహ్నం నిద్ర త్యాగం చేసినా రాత్రి నిద్రపట్టడం లేదు. ఇప్పుడు ఏ స్పెషలిస్ట్ దగ్గరకి వెళ్దాం" అన్నాడు సుబ్బారావు.

"ఆకలయినప్పుడు అన్నం తింటాము. అలాగే నిద్ర వచ్చినప్పుడు నిద్రపోవాలి. మధ్యాహ్నం హాయిగా నిద్రపొండి" అంది అమ్మాయమ్మ.

"అయితే రాత్రి నిద్రపట్టని మూడు గంటలు ఏం చెయ్యాలి?" అన్నాడు సుబ్బారావు.


"మీలాంటివారి కోసమే ఇరవయి నాలుగు గంటల ప్రసారాల టి.వి. ఛానెల్స్ వున్నాయి. మీకు నిద్ర పట్టేవరకూ ఆ కార్యక్రమాలు చూస్తూ వుంటే సరిపోతుంది" అంటూ హోమ్ రెమిడీ చెప్పింది అమ్మాయమ్మ.

-తాజీ ప్రసాద్ (చెన్నై)

ooo

సునీష్ బెడ్ మీద వాలబోతుంటే సెల్ రింగయ్యింది. అతడు సెల్ చేతిలోకి తీసుకుని "హలో" అన్నాడు.

# అపార్థం



"హాయ్! ఏం చేస్తున్నావ్?" అవతలివైపు ఆడపిల్ల గొంతు.

అతడు సెల్‌కేసి చూసాడు. ఆ నెంబర్ తనకు తెలియదు. గొంతు కూడా ఎక్కడా విన్నట్టు లేదు. మరి తనను అంత చనువుగా పలకరిస్తున్నది ఎవరు?

"ఎవరు మీరు?"

"అన్నట్టు..మన విషయం డాడీకి చెప్పాను. ఆయన మొదట కోప్పడ్డారు. 'ఒక పోలీస్ ఆఫీసర్ కూతురువై వుండి, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌ని ప్రేమించావా?' అన్నారు. నేను నిన్ను పెళ్ళాడితే పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో తన పరువు పోతుందని అరిచేసారు."

అతడికేం మాట్లాడాలో అర్థం కాలేదు. బహుశా ఆమె రాంగ్‌నంబర్ దయల్ చేసిందేమోననిపించింది. అందుకే ఫోన్ కట్ చేసేద్దామనుకున్నాడు. కానీ ఆమె చెపుతున్న టాపిక్ ఇంట్రస్టింగ్ అనిపించటంతో ఆ పని చేయలేకపోయాడు.

"...నిన్నటి నుండి నామీద నిఘా కూడా పెట్టారు. ఉదయం ఆఫీసుకి వెళ్ళేప్పుడు కూడా ఓ పోలీసు మఫ్టీలో మా కారుని ఫాలో కావటం చూసాను. ఇప్పుడు కూడా నా కారుని ఆ పోలీసే ఫాలో అవుతున్నాడని నాకు అనుమానంగా వుంది.."

తనేమో పోలీసాఫీసర్ కూతురునని చెపుతోంది. అందులోనూ ప్రేమ వ్యవహారంలా వుంది. ఏదైనా జరగకూడనిది జరిగి, ఆమె సెల్‌లో ఫోన్ నంబర్ గుర్తిస్తే! సునీష్‌కి ఆ టాపిక్ ఇంట్రస్టింగ్‌గా అనిపించినా, పరిస్థితి కాస్త ప్రమాదకరంగానూ తోచింది. అందుకే మెల్లగా గొణిగాడు. "మీరు రాంగ్‌నంబర్‌కి దయల్ చేసినట్టున్నారు"

"...వాట్?!..." ఆమె అదిరిపడ్డట్టుంది. బహుశా తన మాటలు ఆమెను కంగారుపడేలా చేసి వుంటాయి. అందుకే ఆమె "సారీ! నా బోయ్‌ఫ్రెండ్‌కి ఫోన్ చేయబోయి మీకు చేసాను" అని అనబోతుందేమో!

"...నీరజ్! నువ్వు కూడా నా కారునే ఫాలో అవుతున్నావా? నన్ను వీధి చివర దిగేయమంటావా?.. మరి నన్ను ఫాలో అవుతున్న పోలీస్ విషయం?.. సరే!.. నేను మా వీధి చివరే దిగేస్తాను.. వుంటాను."

ఇంట్రస్ట్ నుండి భయం, భయం నుండి అయోమయం... ఆ ఫోన్‌కాల్ ఒక్క నిముషంలోనే తనలో రకరకాల భావాలు కలిగిస్తోంది. ఐనా తను రాంగ్‌నంబర్ అని చెపితే, ఆమె ఆ మాటలు విననట్టే ఏదేదో మాట్లాడేస్తోంది. కొంపదీసి ఆమె తనను 'టీజ్ చేస్తోందా'

అప్పటికే అవతలివైపు ఫోన్ కట్ అయ్యింది. అతడికి వెంటనే ఆమెకు ఫోన్ చేసి, అసలు విషయమేమిటో తెలుసుకోవాలనిపించింది. రింగ్ చేసాడు.

అవతలివైపు ఫోన్ లిఫ్ట్ చేసి "ఆ.. డాడీ.. నేను ఆన్ ది వే వున్నాను. ఇంకో పది నిముషాల్లో ఇంటికి చేరుకుంటాను.." ఆమె ఫోన్ కట్ చేసేసింది.

ఈసారి అతడికి పిచ్చెక్కినట్టయ్యింది. ఆమె తనను ఆటపట్టిస్తుందన్న నిర్ణయానికి వచ్చేసాడు. కోపం కూడా వచ్చింది. అందుకే మరోసారి రింగ్ చేసాడు.

ఆమె వెంటనే ఆన్‌చేసి "నీరజ్..ఏంటి? నో నో! ఇప్పుడే డాడీ ఫోన్ చేసారు. పది నిముషాల్లో ఇంటి దగ్గరుంటానని చెప్పాను. వెనుక పోలీస్ కూడా ఫాలో అవుతున్నాడు. ప్లీజ్! మనం రేపు కలుద్దాం" మరోసారి ఫోన్ కట్ చేసింది.

సునీష్ అరచేత్తో తలకేసి కొట్టుకున్నాడు. 'అనుమానం లేదు. ఆమె తనను టీజ్ చేస్తోంది'. అందుకే మరోసారి ఫోన్ చేద్దామనుకున్నాడుగానీ, వెంటనే ఆ పని చెయ్యలేకపోయాడు. 'రేపు చెపుతా'. తను నన్ను ఆటపట్టిస్తుందా? నేను మరో నెంబర్ నుండి ఫోన్ చేసి తనకు పిచ్చెక్కిస్తా..'

అలా నిర్ణయించుకున్నాక సెల్ పక్కన పెట్టి, బెడ్ మీద వాలాడు.

OOO

మర్నాడు సునీష్ ఆఫీసుకి బయల్దేరబోతుంటే, పక్క పోర్షన్‌లో అద్దెకుంటున్న వామనమూర్తి వచ్చాడు. రెండు నిముషాలు అవీ ఇవీ మాట్లాడాక, వచ్చిన విషయం చెప్పాడు. " మా అమ్మాయికి ఎక్కడైనా మంచి ఉద్యోగం వుంటే చూడండి సార్"

"అదేంటి? మీ అమ్మాయి కాల్‌సెంటర్‌లో పనిచేస్తుంది కదా?"

"ప్రస్తుతానికి చేస్తోంది. కానీ ఆ ఉద్యోగం మానేయాలనుకుంటోంది" నీరసంగా పలికాడాయన.

"ఎందుకని?"

"కాల్ సెంటర్ డ్యూటీలు కష్టంగా వుంటాయి. రాత్రి పన్నెండింటికో, తెల్లవారుఝామునో కంపెనీవాళ్ళు కారులో ఇంటిముందు దించినా, ఈ కాలంలో కారు డ్రైవర్లను కూడా నమ్మలేని పరిస్థితి. మొన్నటికి మొన్న కాల్ సెంటర్ అమ్మాయిని కారు డ్రైవర్ ఎక్కడికో తీసుకెళ్ళి అత్యాచారం చేసి చంపేసి పారిపోయాడు. ఇలాంటి సంఘటనలు సిటీలో అప్పుడప్పుడూ జరుగుతూనే వున్నాయి. అందుకే...రిస్క్ తీసుకోవటం ఇష్టంలేక సాయంత్రానికల్లా ఇంటికి చేరే ఉద్యోగం చేయించాలని అనుకుంటున్నాను" వామనమూర్తి పూర్తిచేసాడు.

"సరే! నాకు తెలిసిన మిత్రులను అడిగి చూస్తాను"

వామనమూర్తి వెళ్ళిపోయాడు. సునీష్ రెండడుగులు ముందుకేసేసరికి ఫోన్ మోగింది. అతడు సెల్ చేతిలోకి తీసుకుని నంబర్ చూసాడు. ఒక్కసారిగా కోపం తన్నుకొచ్చింది. 'ఆ అమ్మాయి మళ్ళీ టీజింగ్ మొదలుపెట్టింది. 'ఏం చేయాలి..ఎలా మాట్లాడాలి..' అనుకుంటూనే సెల్ ఆన్ చేసాడు.

"నమస్తే..నా పేరు ప్రత్యూష..రాత్రి మీకు ఫోన్ చేసి ఇబ్బంది పెట్టింది నేనే..."

సునీష్ కోపాన్ని కంట్రోల్ చేసుకుంటూ "రాత్రి ఇబ్బంది పెట్టింది చాలదా? మళ్ళీ ఇప్పుడు ఎందుకు ఫోన్ చేశారు?" అడిగాడు.

"మీ కోపాన్ని అర్థం చేసుకోగలను. కానీ అసలేం జరిగిందో మీకు తెలిస్తే, మీకీ కోపం వుండదనే అనుకుంటాను"

అతడు అనాసక్తంగానే "చెప్పండి" అన్నాడు.

"నేను ఓ కాల్‌సెంటర్‌లో ఉద్యోగం చేస్తున్నాను. రాత్రి పన్నెండు గంటలకు డ్యూటీ అయిపోయాక కంపెనీ కారులో నలుగురం బయల్దేరాం. మిగతా ముగ్గురూ దిగిపోయాక సిటీకి దూరంగా వుండే మా ఇంటివైపు కారు కదిలింది. అప్పుడే నేను కారు డ్రైవర్‌కేసి పరీక్షగా చూసాను. అతడు కొత్తవాడు. పైగా తాగినట్టు వాసన గుప్పుమంటూ కొట్టింది. మా ఇంటికి ముందు మూడు కిలోమీటర్ల దూరం నిర్జన ప్రదేశం. రోడ్ కట్ చేసి వెళితే చెరువు ప్రాంతానికి వెళ్ళిపోతుంది. అక్కడ అరిచి గీపెట్టినా, ఎవ్వరికీ వినిపించదు. నాకు భయమేసింది. అందుకే సెల్ ఆన్ చేసి తోచిన నెంబర్ దయల్ చేసాను. తెలిసిన నంబర్స్ అయితే అలా మాట్లాడలేను. వారు మీలా తిరిగి కాల్ చేయరు.." ఆమె చెపుతోంది.

ఆమె తనను టీజ్ చేయడం వెనుక అసలు కారణం అర్థమయ్యాక అతడు హాయిగా నవ్వుకున్నాడు. "ఒకే ఒకే..అపార్థం చేసుకున్నందుకు నేనే మీకు సారీ చెపుతున్నాను" చెప్పాడు మనస్ఫూర్తిగా.

-జె.సునీల్ (హైదరాబాద్)